సాక్షి
కాకినాడ

బుధవారం । 10 । జనవరి । 2024



స్మోక్ ఫ్రీ జోన్‌గా అన్నవరం దేవస్థానం


సత్యదేవుని ఆలయ పరిసరాలలో ఆరోగ్యకర మైన వాతావరణం నెలకొల్పేందుకు అన్నవరం దేవస్థానాన్ని స్మోక్ ఫ్రీ జోన్ చేస్తున్నట్లు ఈఓ రామచంద్ర మోహన్ తెలిపారు. - 8లో



ఆశలను కాటేసిన మృత్యువు

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దంపతులు దుర్మరణం పాలయ్యారు. - 8లో

డెల్టాలకు 11 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,350, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

104లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: జిల్లాలోని 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో వివిధ ఖాళీల భర్తీకి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో సాగుతున్న అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ) 20, డ్రైవర్ 20 పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్, టైపింగ్ పరిజ్ఞానం ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు డీఈఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, కనీసం పదో తరగతి పూర్తి చేసి, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న పురుషులు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ పోస్టులకు గరిష్ఠ వయో పరిమితి 35 సంవత్సరాలు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడేటాకు విద్యార్హత పత్రాలు, లైసెన్సు కాపీలు జత చేసి, ఈ నెల 10, 11 తేదీల్లో కాకినాడ డీఎంహెచ్ఓ కార్యాలయంలోని 104, 108 జిల్లా కార్యాలయంలో సమర్పించాలి.

రికవరీ శాతం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంచన. చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: మహిళా సంఘాల రికవరీ శాతం పెరిగే విధంగా జిల్లా సమాఖ్య ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. స్థానిక టీటీడీసీలో మంగళవారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉన్నతికి సంబంధించి 100 శాతం ప్రగతి సాధించాలని, జిల్లా మహిళా సమాఖ్యలో మండల సమాఖ్య సభ్యుల భాగస్వామ్యం ఉండేలా చూడాలని సూచించారు. బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రతి సంఘం వ్యాపారం చేసేలా చూడాల్సిన బాధ్యత జిల్లా సమాఖ్యపై ఉందని చెప్పారు. రాని బాకీలు తగ్గించుకోవాలన్నారు. ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా జిల్లా సమాఖ్య ఆదాయం పెంచుకోవాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణికి జిల్లా సమాఖ్య సభ్యులు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎల్.కాంచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి సి.సంధ్యారాణి, ఉపాధ్యక్షులు జి.కాంతం, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం, కోశాధికారి డి.నిర్మల, డీఆర్‌డీఏ డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లాలోని 20 మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు. జిల్లా సమాఖ్య ప్రగతిని కాంచన వివరించారు.

నేడు చంద్రబాబు తుని రాక

తుని రూరల్: తునిలో జరిగే 'రా కదలి రా' బహిరంగ సభలో పాల్గొనేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బుధవారం తుని వస్తున్నారు. చామవరంలో రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సభా వేదిక ఏర్పాట్లను మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి మంగళవార పరిశీలించారు. విజయనగరం జిల్లా నుంచి మధ్యాహ్నం 3.35 గంటలకు హెలికాప్టర్‌లో చంద్రబాబు ఇక్కడకు చేరుకుంటారు. 5.45 గంటల వరకూ జరిగే బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం వెళ్లి, అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుంటారు.

మన జాంధానీ.. మళ్లీ మెరిసి..



జాంధానీ చీర నేస్తున్న నేత కార్మికుడు రాంబాబు

- జాతీయ స్థాయిలో ఉప్పాడ కీర్తిపతాక రెపరెపలు
- జాంధానీ చీరలకు అరుదైన గౌరవం
- వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్టు విభాగంలో బంగారు పతకం
- ఉత్పత్తి, వ్యాపారం మరింతగా పెంచేందుకు అధికారుల యోచన

పిఠాపురం: బంగాళాఖాతంలో తుపాను వస్తే.. రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టీ కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ గ్రామం మీదనే ఉంటుంది. ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలతో ఛిద్రమైపోయే ఇక్కడి తీరం, బీచ్ రోడ్డు చిత్రాలే మీడియాలో కనిపిస్తుంటాయి. గంగపుత్రులతో పాటు విభిన్న సామాజికవర్గాల వారు నివసిస్తున్న ఈ సాగర తీర గ్రామం.. తన జాంధానీ చీరల కళానైపుణ్యంతో ఇప్పుడు జాతీయ స్థాయిలో ఒక్కసారిగా బంగారంలా తళుక్కున మెరిసింది.

వ్యవసాయేతర విభాగంలో..

ఇప్పటికే అనేక పర్యాయాలు ఉప్పాడ జాంధానీ చీరకు గుర్తింపు రాగా, తాజాగా జాతీయ స్థాయిలో పసిడి పతకం వరించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ పోటీలో ఉప్పాడ జాంధానీ చీరలు ఈ ఘనతను సాధించడం విశేషం. ఈ అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్స్, హస్తకళ, చేనేత, మత్స్య, పారిశ్రామిక రంగాల్లో 14 ఉత్పత్తులను ఎంపిక చేయగా.. వాటిలో మన రాష్ట్రానికి ఆరు పతకాలు లభించాయి. వీటిలో ఉప్పాడ చేనేత కార్మికుల కళాసృష్టి అయిన జాంధానీ చీరకు వ్యవసాయేతర విభాగంలో బంగారు పతకం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆత్మ నిర్భర్ భారత్ ఉత్సవ్–2024 వేడుకల్లో కేంద్ర విదేశాంగ మంత్రి సుబ్రమణ్యం జయశంకర్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ కృతికా శుక్లా తరఫున జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కూరెళ్ల పెద్దిరాజు ఈ అవార్డు అందుకున్నారు.





జాంధానీ చీరలు

జాంధానీ.. అద్భుత కళాసృష్టి

అగ్గిపెట్టెలో పట్టేంత చీరను అత్యంత నైపుణ్యంతో నేసిన ఘనత కలిగిన చేనేత కార్మికులు మన సొంతం. వస్త్ర పరిశ్రమలో తమదైన నైపుణ్యాన్ని ఉప్పాడ నేతకారులు ప్రదర్శిస్తూ, మహిళల మనసులను దోచుకుంటున్నారు. వీరి అద్భుత సృష్టి జాంధానీ చీర. చీరలన్నింటిలోకీ ఈ జాంధానీ చీర విభిన్నంగా ఉండటంతో దీనికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలు వచ్చాయి. వెండి, బంగారు జరీలతో, పట్టు నూలుపై రెండువైపులా ఒకేలా ఉండేలా జాంధానీ చీరలను ఇక్కడి కార్మికులు తయారు చేస్తారు. వీటికి గిరాకీ చాలా ఎక్కువ. 1983లో ఇక్కడ జాంధానీ చీరల తయారీ ప్రారంభమైంది. ఒరిజనల్ జాంధానీ చీర ఖరీదు రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకూ ఉంటుంది. ఒక చీర నేయడానికి నలుగురు మనుషులు అవసరమవుతారు. జాంధానీ చీరలపై నేసే డిజైన్లు ఎంతో కళాత్మకంగా ఉంటాయి. చిలుక, హంస, నెమలి వంటి అనేక రకాల డిజైన్లు ఈ చీరలపై రూపుదిద్దుకుంటున్నాయి. ఎక్కువ డిజైన్ల వల్లనే ఈ చీరల నేత కష్టంగా ఉంటుంది. నిత్యం ఇద్దరి నుంచి ఐదుగురు కార్మికులు పని చేస్తే 20 నుంచి నెల రోజుల్లో అందమైన జాంధానీ చీర తయారవుతుంది. ఈ చీర నేయడానికి ముందు గ్రాఫ్ ఆధారంగా డిజైన్లు తయారు చేస్తారు. ఇది ఒక్క ఉప్పాడ ప్రాంత చేనేత కార్మికులకే సొంతమైన కళా నైపుణ్యమని చెప్పవచ్చు. ఏటా సుమారు రూ.10 కోట్ల మేర ఇక్కడ జాంధానీ చీరల వ్యాపారం జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ఆన్‌లైన్‌లో సైతం ఆర్డర్లు వస్తూండటం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వ చేయూతతో..

రాష్ట్రంలో చేనేతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో.. కనుమరుగవుతోందనుకున్న జాంధానీ చీరల తయారీకి పూర్వ వైభవం వచ్చింది. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.24 వేల సాయం అందిస్తోంది. దీంతోపాటు రూ.3 వేల పింఛన్ సైతం అందిస్తున్నారు. నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) ద్వారా నేత కార్మికులకు రాయితీతో కూడిన నూలు సమకూరుస్తున్నారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా దుస్తుల ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు నగదు క్రెడిట్ సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వినూత్న పథకాలతో తమ ఆర్థిక ఇబ్బందులు సమసిపోయి, చీరల తయారీలో ముందడుగు వేస్తున్నామని చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఉత్పత్తి

నానాటికీ గిరాకీ పెరుగుతూండటంతో ఉప్పాడలో జాంధానీ చీరల ఉత్పత్తి కూడా క్రమంగా పెరుగుతోంది. ఇక్కడ గతంలో రోజుకు ఒకటి రెండు చీరలకు మించి తయారయ్యేవి కావు. అటువంటిది ప్రస్తుతం 50 నుంచి 100 చీరల వరకూ తయారు చేస్తున్నారు. ఉప్పాడతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ చూసిన జాంధానీ చీరల మగ్గాలు పెరిగిపోయాయి. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, అమీనాబాద్, ఉప్పాడ, మూలపేట తదితర గ్రామాల్లో గతంలో 50 వరకూ ఉండే మగ్గాలు నేడు 500 వరకూ చేరుకున్నాయి. వృత్తితో సంబంధం లేకుండా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు జాంధానీ చీరలు తయారు చేస్తున్నారు. చిన్న పిల్లలు సైతం జాంధానీ చీరల తయారీలో ఆరితేరుతున్నారు.

ఖండాంతర ఖ్యాతి

ఇప్పటికే ఉప్పాడ కాటన్, సిల్క్‌కు గతంలో పేటెంట్ హక్కు లభించింది. ఇండియన్ హ్యాండ్లూమ్స్‌లో ప్రముఖ స్థానం సంపాదించింది. ఉప్పాడ జాంధానీ చీరల డిజైన్లతో తపాలా శాఖ ప్రత్యేకంగా కవరు కూడా విడుదల చేసింది. తాజా పసిడి పతకంతో జాంధానీ చీరల ఘనత ఖండాంతరాలకు మరింతగా విస్తరించనుంది. గతంలో ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శనలో జాంధానీ చీరలు ప్రత్యేక గుర్తింపు సాధించడంతో ఇప్పటికే విదేశాల నుంచి సైతం ఆర్డర్లు వస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా జాంధానీ చీరల ఉత్పత్తిని పెంచేందుకు, తద్వారా ఉప్పాడ చేనేత కార్మికుల ఆర్థిక వికాసానికి అవసరమైన సదుపాయాల విస్తరణకు సమగ్ర ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



కలెక్టర్ కృతికా శుక్లాకు అవార్డును అందజేస్తున్న చేనేత, జౌళి శాఖ అధికారి పెద్దిరాజు (ఫైల్)

మరింత అవార్డులు సాధిస్తాం

ఇప్పటికే ఉప్పాడ జాంధానీ చీర చాలా ఘనత సాధించింది. ఇది కేవలం మా కార్మికుల కళా నైపుణ్యమే. ఎన్ని అవార్డులు సాధించినా ఇంకా సాధించాలనే తపనతో నేతలో సరికొత్త నైపుణ్యం కోసం తపన పడుతున్నాం. తద్వారా మరింత అందమైన జాంధానీ చీరలు తయారు చేస్తున్నాం. గతంలో ఏ ప్రభుత్వమూ ఆదుకోక, ఆర్థిక భారంతో నేత నేయలేని దుస్థితిలో ఉన్న మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనిచ్చారు. మాకు, చేనేతకు పునర్జన్మనిచ్చారు. అందుకే మరింత ముందుకు వెళుతున్నాము. కరోనా వంటి కష్ట సమయంలో ప్రభుత్వం ఆదుకున్న తీరు మాలో నూతన ఉత్సాహాన్ని నింపింది. మరిన్ని అవార్డులు సాధించడానికి శాయశక్తులా కృషి చేస్తాం.

– రాంబాబు, చేనేత కార్మికుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

జాంధానీతో చేనేతకు గుర్తింపు



ఉప్పాడలో జాంధానీ చీరలకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. భారతీయ చేనేత గర్వపడేలా ఇక్కడ జాంధానీ చీరలు తయారవుతున్నాయి. తాజాగా దీనికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తిలో భాగంగా దీనిని ఎంపిక చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను ఆకర్షించేలా ప్రభుత్వం ఎన్నో రకాల చర్యలు చేపట్టింది.

– కూరెళ్ల పెద్దిరాజు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, కాకినాడ

నాటి యాత్ర స్ఫూర్తితో ప్రజారంజక పాలన

- గ్రామీణ ముఖచిత్రం మార్చిన ఘనత సీఎం జగన్‌దే
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- ఘనంగా ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్ల సంబరం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: 'నేను విన్నాను.. నేను ఉన్నాను' నినాదంతో.. ప్రతి కుటుంబాన్ని, వ్యక్తిని, వర్గాన్ని కలిసి.. వారి కష్టాలు అర్థం చేసుకున్న ప్రజాసంకల్ప పాదయాత్ర స్ఫూర్తితో.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రజారంజక పాలన అందిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కాకినాడ రమణయ్యపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చరిత్రాత్మకమన్నారు. ఇచ్ఛాపురం వరకూ 3,648 కిలోమీటర్ల మేర ఆయన పాదయాత్ర చేసి, వివిధ వర్గాల ప్రజలను కలుసుకున్నారన్నారు. ఆ రోజు ఇచ్చిన హామీల మేరకు కులం, మతం, పార్టీలు చూడకుండా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. గ్రామీణ వ్యవస్థ ముఖచిత్రం మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో అత్యధికంగా పింఛన్ ఇస్తున్న ఘనత కూడా ఆయనదేనన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఎన్నికలు వచ్చేటప్పటికి చంద్రబాబు నాయుడు రకరకాల అబద్ధాలు చెబుతూ రోడ్ల మీదకు వస్తున్నారని కన్నబాబు అన్నారు. తాను అధికారంలోకి వస్తే గ్యారంటీ.. ష్యూరిటీ అంటూ తిరుగుతున్న చంద్రబాబు.. 2014లో ఇచ్చిన హామీలను 2019 వరకూ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఆ రోజు చేతులెత్తేసి, ఇప్పుడు మళ్లీ తగుదునమ్మా అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. తెల్లవారి లేస్తే జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు ఇది పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధమని చెప్పారు. గ్రామాల్లోకి వెళ్లి అడిగితే జగన్‌మోహన్‌రెడ్డి వల్ల జరిగిన మేలును ప్రజలు చెబుతారని అన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ విజయకేతనం ఎగురవేస్తుందని, 175కు 175 స్థానాలూ సాధిస్తామని కన్నబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, జేఎస్‌టీయూకే ఈసీ సభ్యుడు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను పాల్గొన్నారు.

నాకు టిక్కెట్ ఉండదనడానికి దుర్గేష్ ఎవరు?

ఎమ్మెల్యే గోరంట్ల మండిపాటు

రాజమహేంద్రవరం రూరల్: సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టిక్కెట్ అని టీడీపీ అధిష్ఠానం ఎప్పుడో ప్రకటించిందని.. ఇప్పుడు ఉండదని చెప్పడానికి జనసేన నాయకుడు కందుల దుర్గేష్ ఎవరని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు. నగరంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా విభేదాలేవీ లేవని, జనసేన తమకు కేవలం మిత్రపక్షమేనని, టీడీపీ బలమైన పార్టీ అని అన్నారు. టీడీపీ నిర్ణయానికే కట్టుబడి ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో అధిష్ఠానం ఎక్కడ టిక్కెట్ ఇచ్చినా అసెంబ్లీకి తాను పోటీ చేయటం ఖాయమని, ఎంపీగా మాత్రం పోటీ చేయనని చెప్పారు. అధిష్ఠానం నిర్ణయం మేరకు త్యాగానికి సిద్ధమని గోరంట్ల అన్నారు.

సందడే సందడి...

మూడు పండగలకు మహత్తర చరిత్ర



ఇంటి ముందు ధాన్యం కుచ్చులు



గూడు ఎడ్లబండ్లు

- జిల్లాలో మొదలైన సంక్రాంతి కోలాహలం
- గో పిడకలు... రంగురంగుల ముగ్గులు
- హరిదాసుల కీర్తనలు.. బసవన్నల సందడి
- ఇతర ప్రాంతాల నుంచి శనివారం భారీగా రాక
- జోరందుకున్న వస్త్రాల కొనుగోలు

సాక్షి అమలాపురం: సంక్రాంతి... అచ్చతెలుగు పండగ. ఆంధ్రుల అభిమాన పండగ. జిల్లా అప్పుడే పండగ కళను సంతరించుకుంది. ఒకవైపు బంధువుల రాక.. వీధులలో రంగురంగు ముగ్గులతో కొత్త అందాలు సంతరించుకుని పల్లెలు మురిసిపోతున్నాయి. మరోవైపు వస్త్రాలు, వాహనాలు, బంగారం కొనుగోళ్లతో పట్టణాలు కిటకిటలాడుతున్నాయి. పండగ జరిగేది మూడు రోజులే అయినా జిల్లా వాసులకు వారం రోజులపైగానే సందడే సందడి. ఈ ఏడాది భోగి ఆదివారం వచ్చింది. రెండవ శనివారం కావడంతో శుక్రవారం రాత్రే చాలామంది బయలుదేరి రానున్నారు. బుధవారం ముక్కనుమతో పండగ ముగిసినా చాలామంది ఆదివారం రాత్రి కాని బయలుదేరే అవకాశం లేదు. ఈ విధంగా జిల్లాలో జిల్లాలో పండగ సందడి తొమ్మిది రోజుల పాటు ఉండనుంది.

భోగభాగ్యాల భోగి

దక్షిణాయనంలో సూర్యుడు భూమికి దూరంగా ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుంది. ఆ సమయంలో తాము పడిన కష్టాలు, బాధలను తట్టుకున్నందుకు ఉత్తరాయణ కాలంలో సుఖ సంతోషాలను కోరుకుంటూ భోగి మంటలను వేస్తారు. ఇది ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని నమ్మకం. అందుకే పల్లెలోని వీధులలోనే కాకుండా, పట్టణాలలో సైతం మంటలు వేస్తుంటారు. చాలాచోట్ల కులాలకు అతీతంగా అందరినీ ఒకేచోట చేర్చి, ఐక్యమత్యం పెంచడంలో కూడా భోగి మంటలు తోడ్పడుతున్నాయి. మంటలు వేయడం వల్ల అగ్నిదేవుడిని ఆరాధించడంతోపాటు వాయుదేవునికి గౌరవం ఇచ్చినట్టు భావిస్తారు. భోగి పండగ రోజున సాయంత్రం వేళలో బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఇదే రోజున చిన్నారుల తలపై భోగి పళ్లను పోస్తారు.



భోగి మంటల వద్ద గంగిరెద్దులు, హరిదాసులు, చిన్నారుల సందడి

పచ్చని సీమలో ప్రత్యేకతలు

రాష్ట్రంలోనే ఉమ్మడి గోదావరి జిల్లాలో సంక్రాంతి సందడి అధికం. అందునా పచ్చని కోనసీమలో ఈ పండగకు మరింత విశిష్టత ఉంది. భోగి మంటలు... పిండి వంటలు.. మాంసాహారాలు.. రైతుల బండ్ల ఊరేగింపు.. కోడిపందేలు.. అన్నిచోట్లా పండగ నాడు ఉంటాయి. కోనసీమ జిల్లాలో వీటికి అదనంగా ప్రభల తీర్థాలు నిర్వహిస్తారు. అందుకే కోనసీమలో సంక్రాంతి ఒక ప్రత్యేకం. పండగకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే వీధులలో రంగుల హరివిల్లులు కొలువయ్యాయి. పెంకుటిళ్ల ముందు వేలాడదీసే ధాన్యం కుచ్చులు ముచ్చట గొల్పుతున్నాయి. గోవు పిడల కోసం చిన్నారులు చేస్తున్న సందడి అంతాఇంతా కాదు. పల్లెల్లో ఎటుచూసినా కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత గోడలపై గోవు పిడకలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో మార్కెట్‌లో గోవు పిడకల దండల అమ్మకాలు ఆరంభమయ్యాయి. పల్లెలు, పట్టణాల వీధులలో హరిదాసుల కీర్తనలు.. బసవన్నల సందడులు మొదలయ్యాయి. మరోవైపు పిండి వంటలతో ఇళ్లలో మహిళలు చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. పిండి వంటల ఘుమఘుమలు వీధుల్లో కొత్త పరిమళాలు వెదజల్లుతున్నాయి. కొత్త అల్లుళ్లకు చేయాల్సిన మర్యాదలు, పెట్టాల్సిన పెట్టిపోతలపై ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

పెద్దల పండగ సంక్రాంతి



పాల పొంగులు

మకర సంక్రాంతిని పెద్దల పండగ, పెద్ద పండగ అంటారు. రైతులు ఇండ్ల వద్ద సంప్రదాయ పద్ధతిలో పాలు పొంగించి వాటితో మిఠాయిలు చేస్తారు. కొత్త వస్త్రాలు ధరించడం, చనిపోయిన ఇంటి పెద్దలను గుర్తు చేసుకుని పెద్దలకు వస్త్రాలు పెట్టడం, పితృ తర్పణాలు వదలడం చేస్తారు. మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వకపోయినా, ఈ మకర సంక్రమణానికి మాత్రం తర్పణం చేస్తే మంచిదని నమ్మకం.

రైతుల పండుగ కనుమ

కనుమ రోజున మాంసాహారం తినడం ఆనవాయితీగా వస్తోంది. కక్కా... ముక్కా... కనుమ నాడు పక్కా అని మాంసాహారులు లొట్టలు వేస్తుంటారు. ఇది నిజమైన రైతులు పండగ. ఇంటికి కొత్త ధాన్యం వచ్చిన సంతోషంతో ఇంటి వద్ద పనిచేసేవారికి, హరిదాసులు, గంగిరెద్దుల వారికి ధాన్యాన్ని దానం చేస్తారు. హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు తొక్కుతూ, చేతులతో చిడతలు కొడుతూ, కోడిగుడ్డు లాంటి బోడి తలపై రాగి అక్షయపాత్రను ఉంచి అది కదలకుండా నడుస్తూ హరిదాసు ప్రత్యక్షమవుతాడు. ఎడ్లబండ్లను ముస్తాబు చేసి ఊరేగిస్తుంటారు. ఇదే రోజు కోనసీమ జిల్లాలో పలుచోట్ల ప్రభల తీర్థాలు జరుగుతాయి.

దుకాణాలు కిటకిట: పట్టణ మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా వస్త్ర దుకాణాల కిక్కిరిసిపోతున్నాయి. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో ప్రముఖ వస్త్ర దుకాణాలు రావడంతో ఈ ఏడాది వ్యాపారం మరింత జోరందుకుంది. ప్రధాన దుకాణాలు, చిన్నచిన్న వస్త్ర వ్యాపార దుకాణాల వద్దనే కాకుండా చివరకు రోడ్డు చెంతన అమ్ముకునే వారి వద్ద కూడా వ్యాపారాలు జోరుగు సాగుతున్నాయి. వీటితోపాటు బంగారు ఆభరణాలు, కొత్త వాహనాల కొనుగోలు సైతం అధికంగా జరుగుతోంది.



అమలాపురం పట్టణంలో వస్త్ర దుకాణం వద్ద సందడి

క్లుప్తంగా

జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక


కశ్యప్

అమలాపురం టౌన్: నరసరావుపేటలో ఈ నెల 6,7,8 తేదీల్లో జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో అండర్-17 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మండపేటకు చెందిన పెద్దింటి నరసింహ కశ్యప్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ఆ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన అమలాపురానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ తోట రవి తెలిపారు. త్వరలో బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో కశ్యప్ పాల్గొంటాడని పేర్కొన్నారు. కశ్యప్ మండపేటలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

అత్యాచార యత్నానికి రెండున్నరేళ్ల జైలు

కొవ్వూరు: వివాహితపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి న్యాయమూర్తి రెండున్నర ఏళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన కంబాల సూరిబాబు 2019 జూలై ఒకటో తేదీన కుమారదేవం గ్రామానికి తాపీ పనులు నిమిత్తం వచ్చాడు. భర్త మృతి చెందడంతో పుట్టింటిలో ఉంటున్న మహిళపై కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెను పడక గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో విడిచిపెట్టాడు. బాధితురాలు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై కె.రామకృష్ణ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ఏలూరులోని జిల్లా ఐదో మహిళా కోర్టు న్యాయమూర్తి ఈ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ రామాంజనేయులు వాదించారు.

ప్రగతి పథం.. సంక్షేమ రథం

- గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు
- కొత్త భవనాలతో కళకళ
- రూపురేఖలు మారుతున్న పల్లెలు


కరప మండలం ఉప్పలంకలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గ్రామ సచివాలయం


ఒకే ప్రాంగణంలో నిర్మిస్తున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలన అభివృద్ధి, సంక్షేమానికి సరికొత్త నిర్వచనం ఇచ్చిందనేమాట సర్వత్రా వినిపిస్తోంది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలు, సరికొత్త హంగులతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మరోవైపు జగనన్న కాలనీలతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో పచ్చని పంటలు, పాడితో సుభిక్షంగా ఉన్నాయి. ఓ వైపు వ్యవసాయ పనులు, ఇంకోవైపు ఉపాధి పనులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి.

గ్రామ స్వరాజ్యం సాకారం

దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు. పల్లెలు ప్రగతి సాధిస్తే దేశం అభివృద్ధి సాధించినట్లేనని జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. గ్రామాల్లో నాలుగు సిమెంట్ రోడ్లు, అరకొర మందికి సంక్షేమం అంటూ టీడీపీ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంది. దశాబ్దన్నర కాలం రాష్ట్ర ప్రజల ఆర్థిక స్వావలంబనకు తెలుగుదేశం అడ్డంకిగా మారింది. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వెంటాడుతున్నా, ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా సంక్షేమ పథకాలను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. ప్రతిపల్లెలో కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ప్రభుత్వ వ్యవస్థల భవనాలతో పల్లెలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయి. ఏ గ్రామంలో చూసినా ప్రభుత నూతన భవనాలు కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నాయి. గ్రామాలకే ప్రభుత్వ పాలన అందివచ్చేలా సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ప్రజలు పనుల కోసం గతంలోలా ఇక్కట్లు పడే అవసరం తప్పింది. సచివాలయ వ్యవస్థలో వలంటీర్లను ప్రవేశపెట్టడంతో పల్లె ప్రజలకు ప్రభుత్వ పరమైన సమస్యలు తీర్చుకునేందుకు సులభమైంది. సచివాలయాల్లో వివిధ శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉంటూ 540కి పైగా సేవలు ప్రజలకు అందజేస్తున్నారు.


అభివృద్ధి పనుల్లో భాగంగా తూరంగిలో నిర్మించిన డ్రైనేజీ


ఉప్పలంకలో చురుగ్గా నిర్మితమవుతున్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్

పల్లె చెంతనే సేవలు

ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించడం, వారానికోమారు డాక్టర్లు ఇళ్ల వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించడం, ఉచితంగా మందులు అందజేస్తుండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆర్బీకేల్లోనే సిబ్బంది అందుబాటులో ఉండడంతో రైతులకు గతంలో పడిన కష్టాలు తీరాయి. గ్రామ శివార్లలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సేంద్రియ ఎరువులు అందుబాటులోకి వస్తున్నాయి. రైతులకు పంటతో పాటు పాడి అభివృద్ధి చేసేలా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడంతో మంచి గిట్టుబాటు ధర లభించి రైతులకు పాడి పరిశ్రమల ద్వారా అదనపు ఆదాయం లభిస్తోంది. గ్రామాల్లోనే గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తుండడంతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేంత వరకు దాచుకొనేందుకు వీలుగా గోదాముల సౌకర్యం ఏర్పడనుంది. వీటికితోడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రూ. కోట్లాది నిధులు మంజూరుకావడం మంచి పరిణామం.

కనిపిస్తున్న మార్పు

గ్రామాల్లో విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 385 పంచాయతీలున్నాయి. 620 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పడ్డాయి. వీటికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, పాల సేకరణ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు తదితర వాటిని ఏర్పాటు చేయడంతో మొత్తం గ్రామాల్లో 974 భవనాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే పలు భవనాలు ప్రారంభమై సేవలు అందిస్తుండగా మరికొన్ని భవనాలు చివరి దశలో ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రమే పాలసేకరణ కేంద్రాలు పునాది దశలో ఉన్నాయి.

నాడు–నేడుతో విద్యకు పెద్దపీట

విద్యకు పెద్ద పీట వేస్తూ నాడు–నేడు పథకంలో భాగంగా కోట్లాది రూపాయలు మంజూరు చేసి గ్రామాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలల పాత భవనాలను తొలగించి నూతన భవనాలు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించడంతో నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల్లో అందుబాటులోకి వచ్చింది.

ఒక్కో గ్రామంలో నిర్మాణాలకు మంజూరైన నిధులు

భవనం	నిర్మాణ విలువ
సచివాలయం	రూ.40 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ. 21.80 లక్షలు
విలేజ్ హెల్త్‌క్లినిక్	రూ. 17.50 లక్షలు
పాలసేకరణ కేంద్రం	రూ. 17.50 లక్షలు
డిజిటల్ లైబ్రరీ	రూ. 16 లక్షలు

పల్లెలకే ప్రభుత్వం వచ్చింది



గత ప్రభుత్వాల పాలనకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకే సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వాలను తీసుకొచ్చారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, అడంగళ్, కుల, ఆదాయ, వివాహ ధ్రువీకరణ పత్రాలతో సహా ఇప్పుడు రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లో జరగనుండడం శుభపరిణామం. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఉండడంతో అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బొమ్మిడి నయోమి, సర్పంచ్, ఉప్పలంక, కరప మండలం

ప్రజలకు ఎంతో మేలు



సచివాలయ వ్యవస్థతో ఎంతో మంది పేదలకు అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయి. గ్రామాల్లోనే ప్రత్యక్షంగా సేవలు అందిస్తున్నారు. ఇటు వలంటీర్ వ్యవస్థ అటు సచివాలయ వ్యవస్థలు వల్ల నేరుగా ఇంటికే ప్రభుత్వ సేవలు రావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. గతంలో నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి చేయించుకునే పనులు గంటల వ్యవధిలోనే సొంత గ్రామాల్లోనే సచివాలయాల ద్వారా చేస్తున్నారు.

– బలగం ప్రసన్నకుమార్, మాజీ సర్పంచ్, తూరంగి

మాటలకందని విషాదం

- సీతపల్లి వాగులో పడిన ఇద్దరు బీబీఎం విద్యార్థులు మృతి
- పరీక్షకు వెళ్లకుండా విహారం
- మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు



వాగు ఒడ్డుకు చేర్చిన సుభర్షణి మృతదేహం. (ఇన్‌సెర్ట్‌లో) జబ్బిర్ (ఫైల్)

రంపచోడవరం: ఐ.పోలవరం వద్ద సీతపల్లి వాగులో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. వారి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను అంధకారంలోకి నెట్టింది. ఏజెన్సీలో అందాలు చూసేందుకు స్నేహితులతో వచ్చిన విద్యార్థుల్లో రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన షేక్ జబ్బిర్ (18), పేపరు మిల్లు ప్రాంతానికి చెందిన సుభర్షణి (18) వాగు మధ్యలో ఉన్న బండరాయిపై కూర్చొని మాట్లాడుకుంటుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. జబ్బిర్ ప్రమాదవశాత్తూ జారిపడిపోగా అతనిని రక్షించేందుకు ప్రయత్నించిన సుభర్షణి వాగులో పడి ఇద్దరు మృతి చెందారు.

ఆఖరి పరీక్ష రాయకుండా..

సీతపల్లి వాగులో పడి మృతి చెందిన షేక్ జబ్బిర్, సుభర్షణి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం బీబీఎం చదువుతున్నారు. వీరు తోటి స్నేహితులు తరుణ్ రావిపాటి, విష్ణు మహంతి చిన్ను, షేక్ రోషిణీలతో కలిసి మంగళవారం ఉదయం పర్యాటక ప్రాంతం సీతపల్లి చేరుకున్నారు. అయితే వీరంతా మంగళవారం నాడు బీబీఎం ఆఖరి పరీక్ష రాయకుండానే సీతపల్లి వాగు వద్దకు వచ్చారు. సరదాగా గడుపుతున్న వీరిని మృత్యువు వాగు రూపంలో కబళించింది. వాగులో పడిపోయిన ఇద్దరిని రక్షించేందుకు తోటి స్నేహితులు విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వరరావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం వాటిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుభర్షణి తండ్రి రాజేంద్రకుమార్ ఏరియా ఆస్పత్రికి చేరుకుని రోదించిన తీరు అక్కడి వారిని కలిచి వేసింది. జబ్బిర్ తండ్రి కూడా ఆస్పత్రికి చేరుకుని రోదించారు. పరీక్ష రాయడానికి వెళ్లి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని గుండెలవిసేలా రోదించారు.

స్మోక్ ఫ్రీ జోన్‌గా అన్నవరం దేవస్థానం


పొగాకు నష్టాలను వివరించే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్, అధికారులు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, సత్యదేవుని ఆలయ పరిసరాలలో పొగాకు ఉత్పత్తులను నిషేధించి ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనేలా చేసేందుకు దేవస్థానాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్రమోహన్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం దేవస్థానంలో ఫ్రీ జోన్ డిక్లరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశానుసారం ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ప్రసిద్ధ ఆలయాలను పొగాకు, మత్తు పదార్థాల నిషేధిత ప్రదేశాలుగా ప్రకటించామన్నారు. అన్నవరం దేవస్థానంలో ఎవరైనా సిగరెట్, డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించినా, వ్యాపారస్తులు విక్రయించినా పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం-2003 ప్రకారం అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరించే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.సత్యనారాయణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆశలను కాటేసిన మృత్యువు

- లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి
- ఒకే కుటుంబంలో ఇద్దరు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు


మృతులు ఏనుగు దొరబాబు, ఏనుగు వేణు దంపతులు (ఫైల్)


ప్రమాదానికి గురైన కారు

కిర్లంపూడి/యలమంచిలి రూరల్: తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తును ఇవ్వాలనే ధృడసంకల్పంతో నిత్యం కష్టపడుతూ వారిని ఆ దంపతులు చదివించుకున్నారు. తల్లిదండ్రులు ఆశించిన విధంగానే పెద్ద కుమారుడు ప్రవీణ్ బాగా చదివి చెన్నైలో నేవీలో పనిచేస్తున్నాడు. గుంటూరులో సీఏ చదువుతున్న చిన్న కుమారుడు సురాజ్ మంచి ఉద్యోగం సాధిస్తాడని మురిసిపోతున్న సమయంలో ఆ దంపతులను మృత్యువు కాటేసింది. తమ పిల్లలు వృద్ధిలోకి రావడాన్ని చూడాలనే వారి ఆశ తీరకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

కిర్లంపూడి ఏనుగువీధికి చెందిన ఏనుగు దొరబాబు(52) తన తండ్రి ఏనుగు రంగారావుకు రెండో సంతానం. మృతుడికి గొల్లలమామిడాడకు చెందిన ఏనుగు వేణు(45)తో 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కుటుంబ పోషణకు దొరబాబు దుబాయ్, కాకినాడలో కొన్నాళ్లు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేశాడు. తన పిల్లల చదువుల కోసమని కొన్నేళ్లుగా విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. దొరబాబు విశాఖపట్నం, పరిసర గ్రామాలలో ఏసీల మెకానిక్‌గా పనిచేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం సంక్రాంతి పండగకు తన ఇంటిని శుభ్రం చేసుకుందామని కిర్లంపూడిలో ఉన్న తన స్వగృహానికి ఆ దంపతులు వచ్చారు. పనులు పూర్తి చేసుకుని తమ కారులో సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు. యలమంచిలి మండలం, పోతిరెడ్డిపాలెం వై.జంక్షన్ వద్ద ఎడమ పక్క నుంచి వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారును కుడి వైపుకు తిప్పడంతో డివైడర్ ఎక్కి వైజాగ్ వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టింది. (కారును మృతురాలు వేణు నడుపుతోంది) దీంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఆనందంగా నవ్వుతూ వెళ్లిన వారు విగత జీవులుగా మంగళవారం సాయంత్రం ఇంటికి చేరుకోవడం బంధువులను, గ్రామస్తులను కలచివేసింది.

మార్చురీలో విగతజీవులుగా..

యలమంచిలి మార్చురీలో విగత జీవులుగా ఒకేచోట కన్పించిన దొరబాబు, వీరవేణి దంపతులను చూసి బంధువులు చలించారు. పెళ్లయినప్పటి నుంచి ఒకరినొదిలి మరొకరు ఉండేవారు కాదని, ఎంతో అనురాగంగా వుండేవారని బంధువులు చెప్పారు. జీవితపు తుది మజిలీలో కూడా ఒక్కటిగానే అందనంత దూరాలకు వెళ్లిపోయారంటూ దుఃఖసాగరంలో మునిగిపోయారు.

ఇంటర్ విద్యార్థులకు రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

రాయవరం: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గురువారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు తిరిగి ఈ నెల 18న పునఃప్రారంభం కానున్నాయి. జిల్లా పరిధిలో ఉన్న 13 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, 66 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, 44 ఒకేషనల్ అన్‌ఎయిడెడ్ కళాశాలలన్నింటికీ ఈ సెలవులు వర్తిస్తాయన్నారు. సెలవుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో తరగతులు నిర్వహించరాదన్నారు. ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తే సమాచారం ఇస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్

తేదీ	ఫస్టియర్	సెకండియర్
19న	తెలుగు, హిందీ, సంస్కృతం	తెలుగు, హిందీ, సంస్కృతం
20న	ఇంగ్లిష్	ఇంగ్లిష్
22న	గణితం–ఎ, బోటనీ, సివిక్స్	గణితం–ఎ, బోటనీ, సివిక్స్
23న	గణితం–బి, జువాలజీ, హిస్టరీ	గణితం–బి, జువాలజీ, హిస్టరీ
24న	ఫిజిక్స్, ఎకనామిక్స్	ఫిజిక్స్, ఎకనామిక్స్
25న	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ	కెమిస్ట్రీ,కామర్స్, సోషియాలజీ

ఇదే షెడ్యూల్ ప్రకారం ఒకేషనల్ విద్యార్థులకు కూడా ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

19 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రీ ఫైనల్ పరీక్షలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. 25వ తేదీ వరకు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

అయినవిల్లి: మండలంలోని శంకరాయగూడెంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. అయినవిల్లి మండలం శంకరాయగూడెం గ్రామానికి చెందిన పితాని వీర వెంకటేశ్వరరావు, బొక్కా విజయ్‌లకు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో 36 తులాల బంగారం, 29 తులాల వెండి, ఒక మోటార్ సైకిల్, విద్యుత్ ఉప కరణాలు, మూడు సైకిళ్లు, మూడు లక్షల నగదు మొత్తమ్మీద రూ.10లక్షల నష్టం వాటిల్లింది. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆర్ఐ ముంగడ శివ అర్జునరావు, వీఆర్వో నష్టాన్ని అంచనా వేశారు.

బాధితులను ఆదుకుంటాం

బాధితులను ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆయన కాలిబూడిదైన ఇళ్లను పరిశీలించారు. బాధితులు పితాని వీరవెంకటేశ్వరరావు, బొక్కా విజయ్‌లను ఓదార్చారు. ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామ్మూర్తి, నాయకులు మట్టపర్తి వెంకటరమణ ఉన్నారు.

ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ ఎస్సై, అసిస్టెంట్ రైటర్

రూ.25 వేల లంచం తీసుకుంటూ దొరికిన వైనం


రావులపాలెంలో ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ ఎస్సై, అసిస్టెంట్ రైటర్

రావులపాలెం: స్థానిక పోలీసు స్టేషన్‌పై ఏసీబీ జరిపిన దాడుల్లో రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఎస్సై ఎస్.వెంకట రమణ, అసిస్టెంట్ రైటర్ సత్యప్రసాద్ మంగళవారం పట్టుబడ్డారు. స్థానికుల కథనం ప్రకారం ఇటీవల జియో ఫైబర్‌నెట్ డిస్ట్రిబ్యూషన్‌కు చెందిన కేబుల్ తీగలు తగిలి ఓ బ్యాంకు ఉద్యోగి మృతి చెందినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఆ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డిస్ట్రిబ్యూటర్ అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన సత్తి విజయ రామకృష్ణారెడ్డిపై కేసు తీవ్రత తగ్గించి శిక్ష తక్కువ పడే విధంగా సెక్షన్లు మార్చేందుకు ఎస్సై వెంకట రమణ రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు రామకృష్ణారెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఎస్సై వెంకటరమణ ఆదేశాల మేరకు అసిస్టెంట్ రైటర్ రూ.25 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. నిందితులిద్దరిని విజయవాడలోని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయం స్థానంలో హాజరుపర్చనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.